పదేళ్లకు ముందు: ఆకతాయిల ఆగడాలు, వారి వికృత చేష్టలు.. ఆ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి అతివలది..

ప్రస్తుతం: ధైర్యంగా షీ టీంలకు చెబుతున్నారు. బృందాల్లోని సభ్యులు మఫ్టీల్లో తిరుగుతూ ఆకతాయిల ఆట కట్టిస్తున్నారు. కేసులు పెట్టి కటకటాల్లోకి నెడుతూ మహిళలకు భరోసా ఇస్తున్నారు.

ఆమె ధైర్యం.. షీటీం!

మహిళల భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం 2014 అక్టోబరు 24న అందుబాటులోకి తీసుకొచ్చిన షీటీం వ్యవస్థ పదేళ్లు పూర్తి చేసుకుంది.. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఈ బృందాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అతివలకు భరోసా కల్పిస్తున్నాయి. విద్యా సంస్థలు, ప్రజలు ఎక్కువగా గుమ్మిగూడే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి.


ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, వరంగల్ క్రైం

మీకు తెలుసా..

● ఈవ్‌టీజింగ్ చేస్తూ రెండోసారి పట్టుబడితే నిర్భయ చట్టం కింద కేసులను నమోదు చేస్తారు.

● షీటీంలో ఇన్‌స్పెక్టర్, ఎస్సై, ఏఎస్సై, హెచ్‌సీ, మహిళా కానిస్టేబుళ్లు ఉంటారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ ఏసీపీ, మహబూబాబాద్ జిల్లాలో అదనపు ఎస్పీ పర్యవేక్షణలో ఈ బృందాలు పని చేస్తున్నాయి.

పదేళ్లు పూర్తి చేసుకున్న వ్యవస్థ





గోడపత్రికల ద్వారా ప్రచారం చేస్తున్న షీ బృందం సభ్యులు

నిఘా పెట్టి.. కౌన్సెలింగ్ ఇచ్చి

● ఆరు నెలల కిందట హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలో ఆకతాయిలు విద్యార్థినులను వేధిస్తుండడంతో ఓ మహిళ.. షీటీంకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన బృందం నిఘా పెట్టి వేధింపులకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చింది.

● మూడు నెలల కిందట వరంగల్ పోచమ్మ మైదానం ప్రాంతంలో బస్సులు నిలిపే స్థలంలో కొంతమంది యువకులు మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్నట్లు సమాచారం రావడంతో షీ బృందం మఫ్టీలో ఉండి వారిని పట్టుకుంది.

● మిల్స్ కాలనీ ఠాణా పరిధిలో ఓ మహిళను స్థానికంగా ఉండే యువకులు వేధిస్తుంటే షీ బృందానికి ఫిర్యాదు వెళ్లింది. వారిని కేసు నమోదు చేయించారు.

● హనుమకొండలో దుకాణంలో ఉన్న మహిళను వేధిస్తున్న ఆటో డ్రైవర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు.

క్యూఆర్ కోడ్‌తో..



ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురైనప్పుడు నేరుగా ఫిర్యాదు చేసేందుకు షీ టీంలు 2022లో క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకొచ్చాయి. కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సినిమా థియేటర్లు, ఆర్టీసీ బస్సుల్లో.. ఇలా జనాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ పోస్టర్లను అతికించారు. బాధితులు తమ ఫోన్ ద్వారా దానిని స్కాన్ చేయగానే డీజీ ఆఫీసుకు ఫిర్యాదు వెళ్తుంది. వెంటనే దరఖాస్తు ఫారం వస్తుంది. వివరాలు నమోదు చేసి సెండ్ చేసిన వెంటనే జిల్లా షీటీంకు సంక్షిప్త సమాచారం వెళ్తుంది. బృందం అక్కడికి చేరుకుని ఆకతాయిలను ఆటకట్టిస్తారు.

● qr.tspolice.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి లాగిన్ అయ్యి ఫిర్యాదు చేసే సదుపాయం ఉంది.

ఫిర్యాదుల కోసం సంప్రదించాల్సిన నెంబర్లు

డయల్ 100, 112

వరంగల్ కమిషనరేట్ షీ టీం నెంబరు: 87126-85124

మహబూబాబాద్ షీ టీం నెంబరు, వాట్సాప్: 8712656935, 7901142009

● ఫిర్యాదు చేసినవారి వివరాలను గోప్యంగా ఉంచుతారు.

ఫిర్యాదుల సంఖ్య పెరిగింది

- సుజాత, షీ టీం విభాగం ఇన్‌స్పెక్టర్

గతంలో కంటే ప్రస్తుతం ఫిర్యాదుల సంఖ్య పెరిగింది. మహిళలకు ఉన్న చట్టాలు, రక్షణ గురించి కళాశాలలు, పాఠశాలలో షీ బృందం అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. వారికి రక్షణగా ఉంటుంది. ఫిర్యాదు వచ్చిన వెంటనే సిబ్బంది స్పందిస్తారు.

కేసులు నమోదు ఇలా

	2022	2023	2024
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో	425	525	342
మహబూబాబాద్ పోలీస్‌శాఖ..	09	47	30

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

షీ టీంలు ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో గుడ్, బ్యాడ్ టచ్‌లపై, పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయి. గుడ్, బ్యాడ్ టచ్ అంటే ఏమిటి.. ఏవిధంగా వేధిస్తారో ప్రాక్టికల్‌గా చూపిస్తూ. . ఆ సమయంలో రక్షణ కోసం ఎలా స్పందించాలో బాలికలకు వివరిస్తున్నారు.



మహబూబాబాద్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం..

కాజీపేట ఆర్వోబీ నిర్మాణమెప్పుడు?

రైల్వే జీఎం సమావేశంలో గళమెత్తిన ఎంపీలు

కాజీపేట, మహబూబాబాద్, కేసముద్రం, న్యూస్‌టుడే: ఓరుగల్లు ఎంపీలు రైల్వే సమస్యలపై గళమెత్తారు. దక్షిణ మధ్య రైల్వేలో కీలకమైన కాజీపేట జంక్షన్‌తో పాటు ఇతర రైల్వే స్టేషన్లలో నెలకొన్న సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అత్యంత కీలకమైన కాజీపేటలో కొత్త రైల్వే వంతెన నిర్మాణం (ఆర్వోబీ) త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సికింద్రాబాద్ రైలు నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఎంపీలతో జీఎం అరుణ్‌కుమార్ జైన్ నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి వరంగల్ నుంచి కడియం కావ్యతో పాటు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పాల్గొన్నారు.

ఎంపీ కావ్య ప్రస్తావించిన అంశాలు..



● వరంగల్ నగరం అభివృద్ధిలో కీలకమైన అసంపూర్తి ఆర్వోబీ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి. వంతెన పనుల జాప్యంలో రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఉన్న ఆటంకాలను తొలగించడానికి కృషి చేస్తాం.. రైల్వేశాఖ తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి.

● కాజీపేటను రైల్వే డివిజన్ కేంద్రంగా ప్రకటించాలి

● చింతపల్లి, ధర్మసాగర్ బైపాస్ లైన్ల నిర్మాణంలో రైల్వే శాఖ పునరాలోచించి రైతులకు నష్టం కలగకుండా చూడాలి. కొత్తలైన్ల నిర్మాణంలో రైల్వే స్థానిక రైతులు, అధికారుల సూచనలు తీసుకోకుండా, ప్రజాభిప్రాయం సేకరించకుండా నిర్ణయం తీసుకోవడం సబబు కాదు..

● మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేయడం హర్షణీయం

● కాజీపేట స్టేషన్‌లో అదనపు ప్లాట్‌ఫారాలు, వేచిఉండు గదుల ఆవశ్యకత

మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్..



● సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యం కల్పించేందుకు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో వందేభారత్‌తో పాటు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఇవ్వాలి.

● మహబూబాబాద్‌లో గరీబ్‌రథ్, రప్తీసాగర్, గ్రాండ్‌ట్రంక్, ఏపీ ఎక్స్‌ప్రెస్‌ను నిలపాలి.

● కేసముద్రంలో బీదర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, పద్మావతి(అప్), కరీంనగర్ సూపర్‌ఫాస్ట్, సాయినగర్‌షిర్డీ, సాయినగర్ షిర్డీ వీక్లీ రైళ్లను హాల్టింగ్‌ను పునరుద్ధరించాలి. నాగర్‌సోల్, ఇంటర్‌సిటీ రైళ్లను కూడా నిలపాలి.

● డోర్నకల్‌లో పద్మావతి, కోణార్క్, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలి.

● నెక్కొండలో ఇంటర్‌సిటీ, శాతవాహన, చార్మినార్, నవజీవన్, షిరిడీ, కరీంనగర్ ఎక్స్‌ప్రెస్‌లు నిలపాలి. తాళ్లపూసపల్లి గేట్ నెంబర్ 79 సమీపంలో అసంపూర్తిగా మిగిలిన రైల్వే అండర్‌పాస్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి.

ప్రాధాన్య పనులనే చేపట్టాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావిణ్య

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాధాన్య పనులనే చేపట్టాలని కలెక్టర్ ప్రావిణ్య సూచించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జరుగుతున్న పనులపై గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, డీఆర్డీవో నాగపద్మజ, జడ్పీ సీఈవో విద్యాలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఛాతి ఆసుపత్రి పరిశీలన

నయీంనగర్, న్యూస్‌టుడే : హనుమకొండలోని ప్రభుత్వ ఛాతీ, క్షయ వ్యాధుల ఆసుపత్రిని గురువారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావిణ్య సందర్శించారు. ఆసుపత్రిలోని ఓపీ, ఐసీయూ విభాగాలు, వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి అవసరమైన సదుపాయాల గురించి సూపరింటెండెంట్ డా.సునితను అడిగి తెలుసుకున్నారు.

సుందరీకరణకు తొలగని ముసుగులు



ఉత్తర, దక్షిణ భారతావనికి వారధి కాజీపేట రైల్వే జంక్షన్. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వచ్చేవారికి ముఖద్వారం వంటిది. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలి సిగ్నల్ పాయింట్ వద్ద వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు ఆర్టిఫిషియల్ మొక్కలు, ప్రయాణికులు, చిన్న పిల్లలతో కూడిన విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆరు నెలలైనా ప్రారంభించకపోవడంతో వాటి ముసుగులు అలాగే ఉన్నాయి. – న్యూస్‌టుడే, కాజీపేట టౌన్

పెచ్చులూడుతున్న పెద్దాసుపత్రి!

వివరాలు 8లో..

పచ్చని పొలాల్లో బైపాస్ లైన్ గుబులు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: పచ్చని పొలాల మీదుగా గూడ్స్ బైపాస్ లైన్ కోసం రైల్వే అధికారులు చేసిన ప్రతిపాదన రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. వ్యవసాయం తప్ప మరోటి తెలియని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఏడాది కాలంగా గూడ్స్ బైపాస్ లైన్ ధర్మసాగర్ శివారులోని పొలాల మీదుగా వస్తుందన్న ప్రచారం రైతులను భయానికి గురిచేస్తూనే ఉంది. రెండ్రోజుల కిందట రైల్వేశాఖ ఇదే మార్గంలో బైపాస్ కోసం రూట్‌మ్యాప్ రూపొందించిందని వచ్చిన వార్తలతో తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. ప్యాసింజర్ రైళ్ల రాకపోకలకు ఆటంకం కలుగకుండా ఉండటం కోసం దక్షిణమధ్య రైల్వే అధికారులు గూడ్స్ రైళ్ల కోసం ప్రత్యేక బైపాస్ లైన్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. దీనికి రైల్వే శాఖ అనుమతులు రావడంతో స్థానిక రైతులు గుండెలు బాదుకుంటున్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం చిల్పూర్ మండలం నష్కల్ మీదుగా కరుణాపురం, రాంపూర్, నర్సింగరావుపల్లి, ఎలుకుర్తి, మడికొండ, ధర్మసాగర్, టేకులగూడెం, ఉనికిచర్ల, దేవన్నపేట, జయగిరి గ్రామాల మీదుగా ఈ లైన్ హసన్‌పర్తి రోడ్డుకు చేరుకుంటుంది. పది గ్రామాల పరిధిలోని సుమారు 900 మంది రైతులకు చెందిన 1200 ఎకరాల వరకు భూములను కోల్పోయే పరిస్థితి ఉంది.



ధర్మసాగర్ శివారులో బైపాస్ లైన్ కోసం ప్రతిపాదించిన పొలాలు

● మొదటగా ఓఆర్ఆర్ పక్క నుంచి ప్రతిపాదించగా.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తమ పలుకుబడిని ఉపయోగించి అలైన్‌మెంటును మార్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదట చేసిన ప్రతిపాదననే ఆమోదించి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అనిశా వలలో పీఆర్ ఉద్యోగులు



నగదుతో పట్టుబడ్డ పీఆర్ ఈఈ దిలీప్, అసిస్టెంట్ టెక్నికల్ అధికారి చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఈఈ దిలీప్‌తో పాటు అసిస్టెంట్ టెక్నికల్ అధికారి చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి రూ. 20 వేల లంచం తీసుకుంటూ గురువారం అనిశాకు చిక్కారు. అనిశా డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మల్హర్‌రావు మండలం తాడిచర్లకు చెందిన సదానందం అనే గుత్తేదారు 2023లో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి చేసిన పనులకు రూ.10 లక్షలకు గాను 5.23 లక్షలు మంజూరయ్యాయి. తర్వాత ఫైనల్ బిల్ రూ.4.77 లక్షల మంజూరుకు పాస్ ఆర్డర్ ఇచ్చేందుకు పీఆర్ ఈఈ దిలీప్‌కు రూ.10 వేలు, ఇద్దరు సిబ్బందికి రూ.5 వేల చొప్పున లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు 15 రోజుల నుంచి ఇబ్బంది పెడుతుండగా విసిగి వేసారిన గుత్తేదారు వరంగల్ అనిశా అధికారులను ఆశ్రయించాడు. అనిశా అధికారుల సూచన మేరకు గురువారం సాయంత్రం 5:40 గంటల సమయంలో గుత్తేదారు కలెక్టరేట్‌లోని పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో అధికారులకు డబ్బులు ఇస్తుండగా వెంటనే పట్టుకుని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని శుక్రవారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్‌సుందర్, ఎల్.రాజు, ఎస్.రాజు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఎన్జీవోస్‌కాలనీ, న్యూస్‌టుడే: గతంలో పార్టీల వారీగా అభివృద్ధి జరిగిందని, ప్రజా పాలనలో పార్టీలకు అతీతంగా చారిత్రక ఓరుగల్లు నగరాన్ని అభివృద్ధి చేస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం 49వ డివిజన్ సాయికాలనీలో రూ.6 లక్షలు, 50 డివిజన్ కేయూ ఎంప్లాయిస్ కాలనీలో రూ.35 లక్షలు, ఇందిరానగర్, స్నేహనగర్ కాలనీల్లో రూ.66 లక్షలతో మురుగు కాలువలు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నగరంలో పేరుకుపోయిన సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నిధులు మంజూరు చేశారని తెలిపారు. వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్న డివిజన్‌లలో ముందుగా పనులు చేస్తున్నామని, మిగతా అన్ని డివిజన్ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు గుజ్జుల వసంత, మహేందర్‌రెడ్డి, ఏనుగుల మానస, రాంప్రసాద్, కేతిడి దీపక్‌రెడ్డి, ఆచార్యులు సాయిలు, నాయకులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు లేక మార్కెట్ వెలవెల

పరకాల, న్యూస్‌టుడే: పరకాలలోని వ్యవసాయమార్కెట్ గతంలో పత్తి కొనుగోళ్లు, అమ్మకాలతో, రైతుల సందడితో కళకళలాడేది. ప్రస్తుతం ఇక్కడ పత్తి కొనుగోళ్లు జరగడం లేదు. దళారుల ప్రమేయంతో పత్తి నేరుగా జిన్నింగ్ మిల్లులకే తరలిపోతోంది. ఒకవైపు గ్రామాల్లో అక్రమ కాంటాలు, మరోవైపు మిల్లుల కారణంగా మార్కెట్‌పై ఆధారపడిన కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్కెట్ పరిధిలో పరకాల, నడికూడ, శాయంపేట మండలాలున్నాయి. గతంలో 7, 8 మండలాలు ఉండేవి. జిల్లాల పునర్విభజనలో ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల, భూపాలపల్లిల్లో కొత్త మార్కెట్ల ఏర్పాటుతో పరకాల మార్కెట్ ఉనికి కోల్పోతోంది. మొగుళ్లపల్లి, రేగొండ మండలాలకు చెందిన రైతులు కూడా ఇక్కడికి రావడం లేదు.

నేరుగా మిల్లులకే తరలింపు..

ప్రస్తుతం మూడు మండలాలతో మార్కెట్ నడుస్తుండగా గత నెల నుంచే పత్తి పంట వస్తోంది. దీపావళి పండగ సమీపిస్తుండటంతో పెట్టుబడులు, ఇతర ఖర్చుల కోసం రైతులు పత్తిని తీసుకొస్తున్నారు. గతంలో పరకాలలోనే పత్తి క్రయ విక్రయాలు జరగగా.. 10 నుంచి 20 మంది వరకు ఖరీదుదారులు ఉండేవారు. మూడు జిన్నింగ్ మిల్లులు ఏర్పడటం, మండలాల సంఖ్య తగ్గిపోవడంతో ఖరీదుదారుల సంఖ్య ఐదారుకు చేరింది. మార్కెట్‌లో బహిరంగ వేలం ద్వారా కొనుగోళ్లు జరగకపోవడంతో గిట్టుబాటు ధర లభించక రైతులు మిల్లులవైపే మొగ్గు చూపుతున్నారు. ఇదే సమయంలో ఆయా మండలాల్లోని దళారులు కమీషన్లు మాట్లాడుకొని పత్తిని మార్కెట్‌కు కాకుండా నేరుగా మిల్లులకే చేరవేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో క్రయ విక్రయాలు లేక బోసిపోతోంది. మార్కెట్‌పై ఆధారపడిన హమాలీలు, గంప మహిళ కూలీలు, దాడ్వాయిలు, ఎడ్లబండ్ల కార్మికులకు (సుమారు 200 మంది) ఉపాధి కరవై ఇబ్బందులు పడుతున్నారు. మిల్లుల యజమానులు, దళారులు కుమ్మక్కవడంతో పత్తి మార్కెట్‌కు కాకుండా మిల్లులకు వెళ్తోందని, మిల్లులతోపాటు అక్రమ కాంటాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయిందని కార్మికులు వాపోతున్నారు. చేసేందుకు పనులు లేక మార్కెట్‌లో ఖాళీగా కూర్చుంటున్నామన్నారు. పత్తి నిల్వలు మిల్లులకు వెళ్లకుండా మార్కెట్‌లోనే బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, తమకు ఉపాధి లభిస్తుందని, ఆ దిశగా అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పరకాల మార్కెట్‌లో పనులు లేక ఖాళీగా కూర్చున్న కార్మికులు

హమాలీలకు ఉపాధి అందేలా చూస్తాం

- సీహెచ్.రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్

పరకాల మార్కెట్‌కు సరకులు రాక కార్మికులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. ఆవరణలో 5 వేల మెట్రిక్ టన్నుల గోదాం ఉంది. కానీ రాకపోకలకు సీసీ రహదారి లేదు. సీసీ రహదారిని నిర్మించి సరకుల కొనుగోళ్లు జరిగేలా, హమాలీలకు ఉపాధి అందేలా చూస్తాం.

రవాణా సేవల్లో డీడీల హైరానా!

దళారులను ఆశ్రయిస్తేనే పని..

ఎనుమాముల మార్కెట్ ప్రాంతానికి చెందిన సూర్య టాటాఎస్ వాహనానికి సరైన పత్రాలు లేకపోవడంతో ఇటీవల భూపాలపల్లి జిల్లాలో సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పట్టుబడిన వాహనాన్ని విడిపించుకునేందుకు వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి రాగా రూ.7,225 జరిమానా విధించారు. ఈ మొత్తం డీడీ రూపంలో చెల్లించేందుకు బ్యాంకుల చుట్టూ తిరిగినా.. ఫలితం లేకపోవడంతో కార్యాలయం పరిసరాల్లోని దళారిని ఆశ్రయించాడు. ఒక డీడీలో ఈ మొత్తం లేక పోవడంతో రెండు డీడీలు ఇచ్చాడు. ఒక డీడీకి రూ.200 చొప్పున రూ.400 అదనంగా చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా దళారీ లేనిదే డీడీ పని కావడం లేదు. డీడీల బదులు అంతర్జాలంలో రుసుం చెల్లించేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. –రంగశాయిపేట, న్యూస్‌టుడే

రవాణాశాఖ కార్యాలయాల్లో డీడీ(డిమాండ్ డ్రాఫ్ట్) ద్వారా చెల్లింపులు చేయాలనే నిబంధన వాహనదారులకు ఇక్కట్లు తెచ్చిపెడుతోంది. నగదు రహిత ఆన్‌లైన్ సేవలకు అవకాశం ఉన్నా ఇప్పటికీ కొన్ని ఆఫ్‌లైన్‌లోనే కొనసాగుతున్నాయి. వీటిని అధిగమించాలంటే.. రవాణాశాఖ అంతర్జాల సేవలు మెరుగుపరచాలి.


వరంగల్ ఆర్టీఏ కార్యాలయం

ఇప్పటికే వాహనదారులు రుసుంలన్నీ మీసేవ, ఈ-సేవ, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లిస్తున్నారు. ముందస్తు స్లాట్ విధానం సైతం అంతర్జాలంలోనే అమలు చేస్తున్నారు. మరిన్ని రుసుంలు సైతం చరవాణి సాయంతో ఫోన్ పే, గూగుల్ పే, ఇతర యాప్‌లతో చెల్లించేలా చూడాలి. లేదంటే రవాణాశాఖ ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా నేరుగా దరఖాస్తుదారుడి చరవాణికి ఎస్ఎంఎస్ పంపించేలా మార్పులు చేయాలి. కార్యాలయాల్లో దరఖాస్తు నంబరును నిక్షిప్తం చేస్తే స్కానర్ వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఈ విధానం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నారు.

బ్యాంకుల్లో తప్పని ఇక్కట్లు

వాహనదారులు రుసుంలు, చెల్లింపులు డీడీల రూపంలో చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డీడీల కోసం బ్యాంకుల కోసం వెతకాల్సిన పరిస్థితి. బ్యాంకు వరకు వెళ్లాక ఖాతాదారుడికే డీడీలు ఇస్తామని నిబంధన పెట్టడంతో తలపట్టుకుంటున్నారు. గతంలో నేరుగా ఇచ్చేవారు. నూతన విధానంతో వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే తమకు ఖాతాలు ఎలా ఉంటాయని వాపోతున్నారు.

ఆందోళన



చేతివాటం ప్రదర్శిస్తున్న దళారులు

ఇదే అదనుగా దళారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాహనదారులకు అవసరమైన డీడీలను దళారులు నిల్వ చేసి ఎక్కువ మొత్తంలో విక్రయిస్తున్నారు. పనులు తొందరగా ముగించుకోవాలనే దృక్పథంతో కార్యాలయాల పరిసరాల్లో ఉన్న దళారులను ఆశ్రయించడంతో చెప్పినంత అదనంగా చెల్లించి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. లేదంటే వచ్చిన పని మరో రోజుకు వాయిదా పడుతుంది. బ్యాంకర్ల కొత్త నిబంధనలతో దళారులకు పంట పండుతుంది.

సమయం వృథా..

వాహన పన్నులు, జరిమానాలు, ఇతర రాష్ట్రాల వాహనాల మార్పు, ఇతర కేసులు నమోదు చేసిన సమయంలో చెల్లించాల్సిన రుసుంలన్నీ డీడీల రూపంలోనే కార్యాలయాల్లో తీసుకుంటున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో డీడీ నంబరు, బ్యాంకు పేరు, ఇతర వివరాలు నమోదు చేస్తారు. వచ్చిన డీడీలను ప్రతిరోజు ఓ వ్యక్తి ట్రెజరీలో జమ చేయాల్సి ఉంటుంది. దీంతె చాలా సమయం వృథా అవుతోంది.

ఉమ్మడి జిల్లాలో ప్రతిరోజు జరిగే వాహనాల రిజిస్ట్రేషన్లు, కార్యాలయానికి వచ్చే డీడీల సంఖ్య వివరాలు (సుమారుగా)

జిల్లా	రిజిస్ట్రేషన్లు	డీడీలు
హనుమకొండ	70	40
వరంగల్	60	30
జనగామ	40	25
మహబూబాబాద్	45	25
భూపాలపల్లి	30	20
ములుగు	30	20

రెండు నెలల్లో మార్పులు వస్తాయి

- పుప్పాల శ్రీనివాస్ రవాణాశాఖ ఉప కమిషనర్



రవాణాశాఖ కార్యాలయాల్లో మరో రెండు నెలల్లో సమగ్ర మార్పులు వస్తాయి. వాహనదారులు ఎదుర్కొంటున్న డీడీల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి చాలా సార్లు తీసుకెళ్లాం. సాంకేతిక పరమైన మార్పులు, డిజిటలైజేషన్ ప్రక్రియపై ప్రణాళిక చేస్తున్నారు. త్వరలోనే అమలు చేసేందుకు కసరత్తులు జరుగుతున్నాయి.

ఇదీ నేపథ్యం.. వరంగల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని శాయంపేట హవేలీ, స్టేషన్ చింతలపల్లి గ్రామాల్లో కాకతీయ మెగా జౌళి వస్త్ర పార్కుకు 2017 అక్టోబరు 22న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) ద్వారా 1350 ఎకరాల భూమిని సేకరించింది. ప్రాజెక్టు వ్యయం రూ.1150.47 కోట్లు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఇందులో మౌలిక సదుపాయాల కోసం రూ.706.87 కోట్లను ఖర్చు చేసింది. ప్రధానంగా భూసేకరణకు రూ.159.27 కోట్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ. 547 కోట్లను వెచ్చించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయనేది అంచనా.

కాకతీయకు కైటెక్స్ కళ!

పరకాల, గీసుకొండ, న్యూస్‌టుడే

● డిసెంబరులో వస్త్ర పరిశ్రమ ప్రారంభానికి సన్నాహాలు

వరంగల్ ఉమ్మడి జిల్లాకు తలమానికంగా నిలుస్తున్న కాకతీయ మెగా జౌళి టెక్స్‌టైల్ పార్కులో త్వరలో మరో వస్త్ర పరిశ్రమ ప్రారంభం కాబోతోంది. దుస్తుల తయారీ సంస్థల్లో పేరు పొందిన 'కైటెక్స్' పనులు చివరి దశకు చేరుకున్నాయి. డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.


కాకతీయ వస్త్రపరిశ్రమలో కైటెక్స్ కంపెనీ నెలకొల్పిన యూనిట్లు

ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు..

వస్త్రపరిశ్రమకు శంకుస్థాపన చేసిన ఏడేళ్లలో ఇప్పటి వరకు మూడు పరిశ్రమలు యూనిట్లను స్థాపించాయి. గణేష్ ఎకోటెక్, యంగ్‌వన్‌తోపాటు కైటెక్స్ ముందుకొచ్చాయి.

● ఉత్తరప్రదేశ్ కేంద్రంగా పని చేస్తున్న గణేష్ ఎకోటెక్ సంస్థ మొదటిసారిగా 50 ఎకరాల భూమిని తీసుకుని రూ. 500 కోట్ల పెట్టుబడితో రెండు యూనిట్లను ప్రారంభించింది. ఇక్కడ దేశంలోనే మొదటిసారిగా ప్లాస్టిక్ ఖాళీ సీసాలతో దారం తయారు చేసే పరిశ్రమను నెలకొల్పారు. దీని వల్ల 600 మంది ఉపాధి పొందుతున్నారు.

● దక్షిణ కొరియా దేశానికి చెందిన ప్రముఖ యంగ్‌వన్ సంస్థ క్రీడా దుస్తుల పరిశ్రమ నెలకొల్పడానికి ఎవర్‌టాప్ టెక్స్‌టైల్ అండ్ కాన్ఫెక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వస్త్రపరిశ్రమలో 297 ఎకరాల భూమిని తీసుకుంది. ఈ సంస్థ రూ.1000 కోట్ల పెట్టుబడి పెడుతోంది. 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని అంటున్నారు. ప్రస్తుతం ఒక షెడ్డును ఏర్పాటు చేసి 70 మంది మహిళలకు కుట్టుపై శిక్షణ ఇస్తున్నారు. సూరత్, భీవండి తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన చేనేత కార్మికుల కోసం వస్త్ర పరిశ్రమలో యూనిట్లు నెలకొల్పడానికి ప్రభుత్వం 52 ఎకరాల భూమిని కేటాయించింది.

ఆనందం

చిన్న పిల్లల దుస్తుల తయారీ ఇక్కడే..

కేరళ కేంద్రంగా ఉన్న కైటెక్స్ సంస్థ చిన్నపిల్లల దుస్తుల తయారీ పరిశ్రమను నెలకొల్పుతోంది. ఈ కంపెనీకి 187.24 ఎకరాల భూమిని కేటాయించారు. ఇది పరిశ్రమ స్థాపనకు రూ.1200 కోట్లను వెచ్చిస్తోంది. అవసరమైన షెడ్లను నిర్మించి దుస్తుల తయారీకి కావాల్సిన యంత్రాలను అమరుస్తున్నారు. పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. ఇది పూర్తయితే 11 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. తొలుత వెయ్యి మందికి ఉపాధి కల్పించాలని చూస్తున్నారు. జూన్ 29న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్త్ర పరిశ్రమను సందర్శించారు. ఇదే కైటెక్స్ కంపెనీలో వన మహోత్సవాన్ని ప్రారంభించారు.

సృజన వీచిక.. ఆవిష్కరణలకు వేదిక


భూపాలపల్లిలో తరగతి గదిలో విద్యార్థులు

న్యూస్‌టుడే, భూపాలపల్లి

SCHOOL INNOVATION MARATHON

ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థులు చిన్న వయసులో ప్రాజెక్టుల రూపకల్పన చేసేలా కేంద్ర ప్రభుత్వం, విద్యా శాఖ 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్' అనే కార్యక్రమం చేపట్టాయి.. భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇదో చక్కటి అవకాశం.. 2024-25 సంవత్సరానికి ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నీతి ఆయోగ్, ఏటీఏఎల్ ఇన్నోవేషన్ మిషన్, యూనిసెఫ్, కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఇన్నోవేషన్ విభాగం, ఏఐసీటీఈ సహకారంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిపై ఇప్పటికే జిల్లాల సైన్సు అధికారులకు, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు, సైన్సు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని భూపాలపల్లి జిల్లా సైన్సు అధికారి బి. స్వామి తెలిపారు.

జనవరిలో విజేతల ప్రకటన: నవంబరు 30 నాటికి ప్రాజెక్టుల రూపకల్పన చేసి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి. వాటిని పరిశీలించి 2025 జనవరిలో వెయ్యి మంది విజేతలను ప్రకటిస్తారు. వచ్చే మే నెలలో విజేతలకు బహుమతులు అందిస్తారు. జులై 29న దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద 'ఇన్నోవేషన్ షో'లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో ప్రతి రాష్ట్రం నుంచి 20 బృందాలను విజేతలుగా ప్రకటిస్తారు. ఇంకా 20 బృందాలు ప్రభుత్వ పాఠశాలల నుంచి, 20 బృందాలు ఉమ్మడి జిల్లా నుంచి, ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి 20 బృందాలను ఎంపిక చేయనున్నారు. భూపాలపల్లి డీఈవో రాజేందర్ మాట్లాడుతూ.. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా హెచ్ఎంలు, సైన్సు అధికారులు ప్రోత్సహించాలని చెప్పారు.

అవకాశం

ఎవరికి అవకాశం..?:

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ అవకాశం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో మొత్తం 3,328 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 85కు పైగా ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. 6 నుంచి 10 తరగతి వరకు 2.41 లక్షల మంది, ఇంటర్‌లో 12 వేలకు పైగా విద్యార్థులున్నారు. ఒక్కో పాఠశాల నుంచి బృందంగా విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పన చేయాలి. ఇద్దరు లేక ముగ్గురు మాత్రమే బృందంలో ఉండాలి. schoolinnovation-marathon.org అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే.. విద్యార్థులు, ఉపాధ్యాయునికి ఎంట్రీ కోర్సు నిర్వహిస్తారు. తర్వాత వారి ఆలోచనలు అందులో పొందుపర్చాల్సి ఉంటుంది. అయితే ప్రాజెక్టుల రూపకల్పన ఏవిధంగా ఉండాలంటే.. సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి. ఇప్పటికే పరిష్కారం కనుగొని ఉంటే.. ఇంకా మెరుగైన పరిష్కారాలు సూచించాలి. ఎంపికైన విద్యార్థులకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక బహుమతులు, ఉన్నత విద్యకు సహకారం అందనుంది.

'స్కిల్ డెవలప్‌మెంట్' సభ్యురాలిగా ఎంపీ కావ్య

రంగంపేట, న్యూస్‌టుడే: భారత పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలిగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ఎంపికయ్యారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం తనవంతు ప్రయత్నం చేస్తానని ఎంపీ కావ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పెచ్చులూడుతున్న పెద్దాసుపత్రి!

వైద్యపరంగా ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కు అయిన ఎంజీఎం ఆసుపత్రి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం రోగులతో సందడిగా ఉండే ఆసుపత్రిలో పలు వార్డుల్లో పెచ్చులూడిపడుతున్నాయి. ఏ క్షణంలో మీద పడతాయో తెలియని పరిస్థితి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలో చాలా ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చినవారు ఇక్కడి పరిస్థితి చూసి ఒకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు. వైద్య సేవల సంగతి పక్కన పెడితే.. వసతి, సౌకర్యాలు తీసికట్టుగా ఉండటంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల మరమ్మతులు చేసినా.. సమస్య మళ్లీ మొదటికొచ్చింది. పెచ్చులూడి స్లాబులోని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షాలు పడినప్పుడు గోడలు చెమ్మతో మరింత బలహీన పడుతున్నాయి. గత వారం ఓ వార్డులో పెచ్చులూడి కిందపడగా.. త్రుటిలో ప్రమాదం తప్పింది.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి




పురుషుల కొత్త(న్యూ మేల్) మెడికల్ వార్డు వద్ద


ఖైదీల వార్డుకి వెళ్లే దారిలో..



కిచెన్ కాంప్లెక్స్ మార్గంలో..


మహిళల మెడికల్ వార్డు వైపు..


ఆర్ఎంఓ కార్యాలయం వద్ద..

173 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ. 4.48 లక్షల విలువైన 173 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు... పరకాలకు చెందిన బి. రఘు చుట్టపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్‌మిల్లులో నిల్వ ఉంచినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం ఇచ్చింది. దీంతో తనిఖీ నిర్వహించి 60 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే గీసుగొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన జె. వేణు మారుతి మల్టీటెక్ రైస్ మిల్లులో రాయితీ బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసి 95 క్వింటాళ్లు, మడికొండ మండలం అమ్మవారిపేట శివారుల్లోని రాజేశ్‌కు చెందిన మహాలక్ష్మి కోళ్ల ఫారంలో 18 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.


పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కిట్స్ విద్యార్థులకు రూ.14 లక్షల ప్యాకేజీ


ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ. 14 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. అశోక్‌రెడ్డి గురువారం తెలిపారు. సీఎస్ఈ విభాగానికి చెందిన ఆకాశ్ పున్నం, సీఎస్ఎం చివరి సంవత్సరం చదువుతున్న రాకేశ్ మామిడి ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇటీవల మూడు దశల్లో జరిగిన ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగాలను సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం కంపెనీ ప్రతినిధులు పంపిన నియామక పత్రాలను ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థులకు అందజేసి అభినందించారు.

పురపాలికలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

జనగామ, న్యూస్‌టుడే: నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పురపాలికలకు ఉపశమనం లభించనుంది. 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్(బేసిక్) గ్రాంటు కింద నిధులను కేటాయించారు. నాన్‌మిలియన్ ప్లస్ పట్టణాల కేటగిరీలో 2023-24కు సంబంధించి రెండో విడత నిధులను విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని వేతనాలు, నిర్వహణ ఖర్చులకు వినియోగించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. కనీస సౌకర్యాల కల్పన, పారిశుద్ధ్య అవసరాల కోసం వస్తు సామగ్రి, వాహనాల కొనుగోలుకు వీటిని వినియోగించాల్సి ఉంటుంది. గతంలో విడుదలైన నిధులు, వినియోగం తదితర అంశాలకు సంబంధించి వివరాలను సమర్పించాలి. ఉమ్మడి జిల్లాలోని వరంగల్ కార్పొరేషన్, 9 పురపాలికలకు మొత్తం రూ. 97863789 మంజూరయ్యాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివరాలు (రూ.లలో)

పురపాలిక	విడుదలైన నిధులు
వరంగల్(కా.)	70120849
జనగామ	4421374
భూపాలపల్లి	5247185
పరకాల	2301994
డోర్నకల్	1224600
మహబూబాబాద్	6062481
మరిపెడ	1544914
తొర్రూరు	2062493
నర్సంపేట	3266607
వర్ధన్నపేట	1611292

వైద్య విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించడానికి 'క్రితి' సదస్సు

● కేఎంసీలో రెండురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు


మాట్లాడుతున్న కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి, క్రితి సదస్సు కన్వీనర్ డా.సుజిత్ ఆర్ పున్నం, డా.వేణుజి బత్తిని, జూనియర్ వైద్యులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఈ నెల 25, 26 తేదీల్లో కాకతీయ మెడికల్ కాలేజీ(కేఎంసీ)లోని ఎన్ఆర్ఐ భవనంలో కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్నోవేషన్స్(క్రితి) పేరిట కాకతీయ పరిశోధన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కేఎంసీ యూఎస్ఏ అల్యూమిని, 'క్రితి' సదస్సు కన్వీనర్ డా. సుజిత్ ఆర్ పున్నం, డాక్టర్ వేణు జి. బత్తిని తెలిపారు. గురువారం కేఎంసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డితో కలసి వారు పరిశోధన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులను క్లినికల్ వైద్యంతో పాటు పరిశోధన వైపు మళ్లించడానికి రాష్ట్రంలోనే మొదటిసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనడానికి దేశ నలుమూలల నుంచి 1000 మందికిపైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. దక్షిణ భారత దేశంలోనే అత్యధిక పారితోషికం రూ. 3 లక్షలతో పాటు పరిశోధనలో అభిరుచి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు.

తొమ్మిదిరకాల పోటీలు..: అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఉద్దేశించిన 9రకాల పోటీలు ఇందులో ఉంటాయన్నారు. 350 మందికి పైగా విద్యార్థులు తుదిపోటీల్లో ప్రతిష్ఠాత్మక సత్కారాల కోసం పోటీపడతారన్నారు. రెండురోజుల పాటు సాగే కార్యక్రమంలో ఈ నెల 25న మొదటిరోజు డిబేట్, హ్యాకథాన్, జెపార్డీ(ఇండియాలోనే అతిపెద్ద మెడ్‌క్విజ్), రెండోరోజు ఈ నెల 26న పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, సింపోజియం పోటీలు ఉంటాయన్నారు. ముఖ్య అతిథులుగా కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కరుణాకర్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. సంధ్య, కేఎంసీ ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా. కాళీప్రసాదరావు, ఏపీఐ అధ్యక్షుడు డా. సతీష్‌కతులా హాజరవుతారన్నారు. సమావేశంలో క్రితి కేఎంసీ విద్యార్థుల విభాగం ప్రతినిధులు డా. శశాంక్, రోహిత్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

రైతుల ఆనందానికి సీఎం కృషి


రాంగనర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ రవీందర్‌రావు

ఐనవోలు, న్యూస్‌టుడే: రైతు కళ్లల్లో ఆనందం చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. నందనం సొసైటీ ఆధ్వర్యంలో రాంనగర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం వారు ప్రారంభించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని తన దృష్టికి వచ్చిందని, ఈసారి అలాంటి ఆరోపణలు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి అవకతవకలు జరిగినా తన ఫోన్ 8096107107 నెంబరుకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. టెస్కాబ్ ఛైర్మన్ మాట్లాడుతూ.. నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మంచి ధర పొందాలని రైతులకు సూచించారు. అనంతరం సొసైటీ ద్వారా మంజూరైన కర్షకమిత్ర రుణం రూ.6 లక్షల చెక్కులను రైతుకు అందజేశారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వర్‌రావు, సాంబయ్య, బండి సంపత్, ఎలీషా, సత్యంగౌడ్, రాకేశ్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రావు, జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో జ్వరంతో మహిళ మృతి


తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమార్తె


కవిత (పాత చిత్రం)

కమలాపూర్, న్యూస్‌టుడే: జ్వరం రావడంతో ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకొని వస్తున్న మహిళ ఆర్టీసీ బస్సులోనే మృతి చెందిన ఘటన కమలాపూర్ మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వంగపల్లి గ్రామానికి చెందిన అంకిల్ల కవిత (36) జ్వరంతో బాధపడుతూ.. నాలుగు రోజులైనా తగ్గకపోవడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లారు. రెండ్రోజులు అక్కడే ఉండి చికిత్స తీసుకున్నారు. గురువారం భర్త కుమారస్వామితో కలిసి బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. అంబాల వద్ద చలిగా ఉందని కవిత చెప్పడంతో భర్త చద్దరు కప్పారు. కొద్దిసేపటికి స్వగ్రామం వంగపల్లికి బస్సు చేరుకోవడంతో భర్త తట్టిలేపగా.. సీటులో నుంచి ఆమె కిందపడిపోయింది. తోటి ప్రయాణికులు పరిశీలించగా ఆమె అప్పటికే చనిపోయిందని గుర్తించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. జ్వరంతో ఆసుపత్రికి వెళ్లిన తల్లి ఆరోగ్యంగా తిరిగి వస్తుందని ఎదురు చూస్తున్న పిల్లలు ఆమె మృతి విషయం తెలిసి బస్టాండుకు చేరుకున్నారు. తల్లి మృతదేహంపై పడి రోదించారు. విషయం తెలిసి ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వొడితల ప్రణవ్ స్థానిక నాయకుల ద్వారా రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

27న సైకిల్ ర్యాలీ


ప్రచార గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 27న ఉదయం 6 గంటలకు ఏజే పెడల్స్, ట్రైసిటీ సైకిల్ రైడర్స్ సంయుక్తంగా సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నారని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో ప్రచార గోడపత్రికలను సీపీ ఆవిష్కరించారు. రోజూ కొంత సమయం సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. యువత పెద్ద సంఖ్యలో సైకిల్ ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏజే పెడల్స్ యాజమాన్యం జయంత్, వరుణ్, ఆనంద్, ట్రైసిటీ రైడర్స్ అసోసియేషన్ సభ్యులు విద్యాసాగర్, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, కుమార్, ప్రసాద్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

శాయంపేట, న్యూస్‌టుడే: శాయంపేట జీవన్‌నగర్ సమీపంలో గురువారం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో నడికూడ మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన ఆగయ్యకు, శాయంపేటకు చెందిన చిన్నారి ఆకునూరి కల్యాణికి గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ప్రమోద్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

హసన్‌పర్తి : అతి వేగంగా వస్తున్న కారు డీసీఎంను ఢీకొనడంతో ఒకరికి గాయాలు అయ్యాయి. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. ఎల్కతుర్తి మండలం చింతపల్లికి చెందిన కారు డ్రైవర్ ప్రయాణికులకు తీసుకుని గురువారం రాత్రి హనుమకొండకు వెళ్తుండగా.. హసన్‌పర్తి మండలం సీతంపేట క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ఓ పక్కన తగిలి అదుపు తప్పింది. ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్‌కు ఢీకొంది. ఈఘటనలో కారు అద్దాలు పగిలి డ్రైవర్ గాయపడ్డారు. కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. కారులోని ప్రయాణికులకు ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

వీసీకి మంద కృష్ణ అభినందన


ఉప కులపతి కె.ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న మందకృష్ణ మాదిగ

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం నూతన ఉప కులపతి కె.ప్రతాప్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో యువతది కీలక పాత్ర


సదస్సులో మాట్లాడుతున్న ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, తదితరులు

సుబేదారి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధిలో యువతది కీలక పాత్ర అని కమిషనరేట్ ఏహెచ్‌టీయూ విభాగం ఇన్‌స్పెక్టర్ వెంకన్న అన్నారు. గురువారం సుబేదారి అసంత్ భవన్‌లో ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూషన్ సహకారంతో గ్రామీణ యువతకు 'గ్రామాల అభివృద్ధిలో యువత పాత్ర' అనే అంశంపై మూడ్రోజుల సదస్సును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కరుణాకర్‌రావు, క్రాంతి, ప్రొఫెసర్ చంద్రమౌళి, శ్రీకాంత్, సుధాకర్, కవిత, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆ భూములు దళితులకు ఇప్పించాలి

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములు రద్దు చేసి, భారాస హయాంలో ఇతరులకు పట్టాలు ఇచ్చారని.. వాటిని తిరిగి దళితులకు ఇప్పించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో భూమి లేని పేదలకు పంచరాయి, శిఖం భూములను పంపిణీ చేసి పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. వాటిలో పంటలు సాగుచేసుకొని పేదలు జీవనోపాధి పొందతుండగా.. భారాస ప్రభుత్వం అసైన్డ్ భూములు ఇతరులకు పట్టాలు చేశారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్, నాయకులు శనిగరం రాజ్‌కుమార్, విజయ్, సాంబయ్య పాల్గొన్నారు.

స్థానికులకే ఆలయ కమిటీ ఛైర్మన్ కేటాయించాలి

ఐనవోలు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి దేవస్థాన కమిటీ ఛైర్మన్ పదవి మండల వాసులకే కేటాయించాలని భాజపా నాయకుడు మాదాసి ప్రణయ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మరో మండలానికి చెందిన నేతలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు.

ఏమిటీ పరిస్థితి.. నగరంలోనే ఈ దుస్థితి


ఇంటి ముందు నిలిచిన వర్షం నీరు


బురదలో దిగబడిన ఆటో

ఈ రోడ్లను చూస్తే మారుమూల పల్లె ప్రాంతమేమో అనుకుంటే పొరపాటే. హనుమకొండ నగరం ప్రకాష్‌రెడ్డిపేట సమీపంలోని ఇందిరమ్మ కాలనీ పరిస్థితి ఇది. 2009లో అప్పటి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఇక్కడి కాలనీ వాసులకు పట్టాలు ఇచ్చారు. 2500 ఇళ్లు నిర్మించారు. కనీస సదుపాయాలు లేకపోవడంతో ప్రస్తుతం 400 కుటుంబాలు మాత్రమే నివశిస్తున్నాయి. అన్నీ మట్టిరోడ్లే. రాళ్లు తేలి, గుంతలు పడి ప్రస్తుత వర్షాలకు బురదమయంగా మారాయి. డ్రైనేజీ సరైన వ్యవస్థ లేకపోవడంతో మురుగు, వర్షం నీరు కలిసి ఇళ్లముందే నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నాయని కాలనీవాసి యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

– ఈనాడు, హనుమకొండ

జీవితానికి అర్థం చెప్పిన మహర్షి వాల్మీకి


వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న జంగా

మడికొండ, న్యూస్‌టుడే: పుట్టగానే ఎవరూ చెడ్డవారు కారని, మార్పుతో మనిషి మహనీయుడు కాగలడని నిరూపించిన మహర్షి వాల్మీకి అని, ఆయన జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ సీడ్స్ గ్రోవర్స్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. కాజీపేట మండలం మడికొండలో నిర్వహిస్తున్న వాల్మీకి జయంతి స్వర్ణోత్సవాలకు గురువారం ఆయన హాజరయ్యారు. చిత్రపటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. . వాల్మీకి తన జీవితంలో చోటుచేసుకున్న మార్పుతో మహా కవి అయ్యారని, రామాయణ ఇతిహాసాన్ని మనకు అందించారని అన్నారు. బోయలు అత్యధికంగా ఉన్న మడికొండలో వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలం ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయాన్ని నిర్మించి, ఏటా జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. రామన్న ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని రాఘవరెడ్డి ప్రారంభించారు. మడికొండ బోయ వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోగి లింగమూర్తి, మెట్టుగుట్ట ఛైర్మన్ రఘు, కాంగ్రెస్ నాయకులు కుర్ల మోహన్, బైరి లింగం, బోయ సంఘం నాయకులు వెంకటప్రసాద్, వెంకటయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో లోకాయుక్త విచారణ

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వంగర శివారు సర్వే నంబర్ 709/3లో 4.33ఎకరాల భూమిపై లోకాయుక్త అధికారి కౌశ గురువారం విచారణ చేశారు. గ్రామానికి చెందిన పింగిళి ప్రత్యూష తనకు వారసత్వంగా వచ్చిన భూమిని నాగయ్య పేరు మీద 1997 నుంచి రికార్డులో నమోదు అయిందని 2022లో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా లోకాయుక్త అధికారి క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి విచారణ చేసినట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఆచార్య సాయిబాబా సంతాప ర్యాలీ



విద్యానగర్, న్యూస్‌టుడే: మానవ హక్కుల కార్యకర్త, ఆచార్య సాయిబాబా మృతికి గురువారం కాకతీయ విశ్వవిద్యాలయంలో నివాళి అర్పించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో వర్సిటీ గ్రంథాలయం నుంచి మొదటి గేటు వరకు సంతాప ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ కార్యాలయం ముందు సాయిబాబా చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

శిక్షణను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న డీఈవో వాసంతి

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలని డీఈవో డి.వాసంతి అన్నారు. గురువారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్, బాలికల ఉన్నత పాఠశాలలో పదోన్నతి పొందిన, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జీవ, భౌతికశాస్త్రం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో హాజరై మాట్లాడారు. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని, చదువుతో పాటు సైన్స్‌పై ఆసక్తి కలిగించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.శ్రీనివాస్, ఎంఈవో రమేష్‌బాబు, డీఎస్‌వో శ్రీనివాసస్వామి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నవంబరు 4న వ్యర్థం నుంచి అర్థం ప్రదర్శన

నయీంనగర్: పాఠశాల విద్యాశాఖ, నేషనల్ గ్రీన్ కోర్ (ఎన్‌జీసీ) సంయుక్త ఆధ్వర్యంలో నవంబరు 4న హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'వ్యర్థం నుంచి అర్థం' ప్రదర్శన నిర్వహించనున్నట్లు డీఈవో వాసంతి, డీఎస్‌వో శ్రీనివాసస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని 8 నుంచి పదో తరగతి విద్యార్థులు వివిధ ఆకృతులతో తయారు చేసిన ఎగ్జిబిట్లతో పాల్గొనాలని చెప్పారు. విజేతలకు నగదు, ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి సెల్ నెంబరు 9490112848లో సంప్రదించాలని సూచించారు.

శ్రీసీతారామచంద్ర స్వామికి తులసీ దళార్చన



మడికొండ, న్యూస్‌టుడే: మడికొండలోని పవిత్ర పుణ్యక్షేత్రం మెట్టుగుట్టపై గురువారం శ్రీసీతారామచంద్ర స్వామికి తులసీ దళాలతో అర్చన మహోత్సవం నిర్వహించారు. శ్రీరాముని జన్మనక్షత్రం పురస్కరించుకుని అర్చకులు పరాశరం విష్ణువర్ధన చార్యులు హోమం చేసి, అనంతరం స్వామివారికి ప్రత్యేక అర్చనలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున శ్రీసీతారాములను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈఓ శేషుభారతి, అర్చకులు అభిలాష్‌శర్మ, సత్యనారాయణశర్మ, ఛైర్మన్ పైడిపాల రఘుచందర్ పాల్గొన్నారు.

ఎస్ఏ-1 పరీక్షల పరిశీలన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలను గురువారం పాఠశాల విద్య ప్రాంతీయ ఉప సంచాలకుడు కె.సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో బోధన తీరు గురించి అడిగారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట డీఈవో వాసంతి, ఎంఈవో రమేశ్‌బాబు, ఏఎంవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

హామీలు అమలు చేయాలని వినతి

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్ కోరారు. గురువారం తహసీల్దార్ జగత్‌సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని, అర్హులందరికీ రుణ మాఫీ చేయాలని కోరారు.

ధర్మయుద్ధం సదస్సును జయప్రదం చేయండి

ఐనవోలు, న్యూస్‌టుడే: వరంగల్‌లో ఈ నెల 26న తలపెట్టిన మాదిగ ధర్మయుద్ధ సదస్సుకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి జయప్రదం చేయాలని ఎంఎస్పీ, ఎమార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నారాయణ పిలుపునిచ్చారు. గురువారం నందనంలో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'హలో మాదిగ చలో మహాజన.. చలో వరంగల్' నినాదంతో కదలి రావాలన్నారు. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట ఇచ్చి తప్పడం సరికాదన్నారు. ధర్మంగా చేపట్టాల్సిన ఎస్సీ వర్గీకరణ కోసం కలిసికట్టుగా పోరాడాలన్నారు. నాయకులు బాబు, శ్రీను, దేవదాసు, ఏలియా, రమేష్, చంద్రయ్య, సింధూ, మొగిళి, భాస్కర్, అనిల్ తదితరులు పాలొన్నారు.

'నిధుల దుర్వినియోగం జరగలేదు'

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఐసెట్‌లో ఎలాంటి నిధుల దుర్వినియోగం జరగలేదని కన్వీనర్ ఆచార్య పి.నరసింహాచారి అన్నారు. గురువారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవేశ పరీక్షను పటిష్ఠంగా నిర్వహించామని, నిర్వహణ ఖర్చులు అన్ని ఉన్నత విద్యా మండలికి ఆడిట్ చేసి పంపించామని చెప్పారు. గతేడాది కంటే ఈ ఏడాది ఐసెట్‌కు అధిక సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడం వల్ల నిర్వహణకు ఎక్కువ కేంద్రాలు చేశామని, అందుకే ఖర్చు పెరిగిందని వివరించారు. రూ.29 లక్షల కన్ఫిడెన్షిల్ నిధులకు సంబంధించి అన్ని బిల్లులు పెట్టామని, ఆడిట్ కూడా చేయించి ఉన్నత విద్యా మండలికి సమర్పించినట్లు తెలిపారు. దీనిపై ఎలాంటి విచారణకైన సిద్ధమని అన్నారు.

పరకాల, న్యూస్‌టుడే: పరకాల మండలం లక్ష్మీపురంలో అంతర్గత సీసీ రహదారులు దెబ్బతిన్నాయి. పలు చోట్ల మురుగు కాల్వలు లేకపోవడంతో మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోంది. **- మహేందర్, లక్ష్మీపురం**

సమాధానం: మురుగు నీరు రహదారిపైకి రాకుండా చర్యలు తీసుకుంటాం. నిధులు మంజూరు కాగానే మురుగు కాల్వలు, సీసీ రహదారులను నిర్మిస్తాం. **- పెద్ది ఆంజనేయులు, ఎంపీడీవో, పరకాల**

మురుగుకాలువ శుభ్రం

స్పందనకు వందనం

శాయంపేట, న్యూస్‌టుడే: శాయంపేట తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి కౌంటర్ వద్ద ఉన్న మురుగుకాలువను బుధవారం పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. మురుగుకాల్వలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా.. సిబ్బందితో మురుగుకాల్వను శుభ్రం చేయించారు.

27న మోషన్ టాలెంట్ సెర్చ్ పరీక్ష


వివరాలు వెల్లడిస్తున్న ఛైర్మన్ వేణుగోపాల్‌గౌడ్

నయీంనగర్, న్యూస్‌టుడే: ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 27న మోషన్ టాలెంట్ సెర్చ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా రూ.150 కోట్ల ఉపకార వేతనాలు, రూ.2 కోట్ల నగదు బహుమతి, 500 మందికి ఉచిత విద్య అందిస్తామని చెప్పారు. మిగతా వారికి ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 97030 00850, 97030 00852 చరవాణి నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్‌కుమార్‌గౌడ్, హెడ్ ఎం.సురేష్, ఏవో బి.మురళి, సుమన్, రమేష్‌గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల చోరీ.. కేసు నమోదు

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: కాజీపేట రహమత్‌నగర్, సోమిడి ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనంపై కాజీపేట ఠాణాలో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమిడికి చెందిన నరసింహరాజు, రహమత్‌నగర్‌కు చెందిన భగవాన్ ఉపాధ్యాయ తమ ద్విచక్ర వాహనాలను ఇంటి ముందు పార్కింగ్ చేయగా, గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు క్రైమ్ విభాగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నగలు..

పరకాల రూరల్: పరకాల మండలం కామారెడ్డిపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పరకాల సీఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోరె విజయ్‌కుమార్ హనుమకొండలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఆయన బుధవారం విధులకు వెళ్లగా.. ఆయన భార్య ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. ఉంట్లోని బీరువా తాళం పగులగొట్టి ఉంది. అందులో దాచిన 132.5 గ్రాముల బంగారు, వెండి నగలను చోరీ చేసినట్లు గుర్తించారు. విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

కుక్కల దాడిలో రైల్వే ఉద్యోగినికి తీవ్ర గాయాలు


ఎంజీఎం ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న శోభారాణి

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: ఇంటి నుంచి వెళ్తున్న రైల్వే ఉద్యోగినిపై వీధి కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. కాజీపేటలోని విష్ణుపురి కాలనికి చెందిన శోభారాణి గురువారం ఉదయం 7 గంటల సమయంలో విధులకు రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా.. మార్గం మధ్యలో నాలుగు కుక్కలు వెంబడించి కరిచాయి. చేతికి రెండు చోట్ల తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. వీధి కుక్కల బెడద ఎక్కువైందని, నగరపాలక సంస్థ అధికారులు వాటిని పట్టి, తరలించాలని విష్ణుపురి కాలనీ ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన అగ్రంపహాడ్‌లో చోటు చేసుకుంది. సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కుల కుమారస్వామి(60) కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం ఇంట్లో ఉన్న పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నవంబర్ 3న జరగనున్న ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనానికి కార్యకర్తలు తరలిరవాలని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి మైదం రవి మహారాజ్ అన్నారు. ఆత్మకూరులో గురువారం మహా సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సలీం పాషా, నాయకులు పరికి శివ, పెరుమాండ్ల శ్రీనివాస్, శైలనిబాబా తదితరులు పాల్గొన్నారు..

తప్పుడు ఆరోపణలను సహించేది లేదు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: బ్యాంక్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగమల్లేశ్వర్ అన్నారు. నీరుకుళ్లలోని యూనియన్ బ్యాంక్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రూ.6.97 కోట్ల రుణమాఫీ వచ్చిందన్నారు. రుణమాఫీ అయిన ప్రతి రైతుకు కొత్త రుణాలు ఇచ్చినట్లు తెలిపారు.

పరకాల నియోజకవర్గం

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తత అవసరం


ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

దామెర, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో లలితాదేవి అన్నారు. ఒగ్లాపూర్‌లోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌లో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. లలితాదేవి మాట్లాడుతూ ఉద్యోగులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్య నిపుణులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ డీజీఎం సమ్మయ్య, వైద్యులు రాంరెడ్డి, ఆశాలత, సృజన, రుబీనా, పద్మశ్రీ, మహేంద్రన్, మండల వైద్యాధికారి మంజుల, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

దామెర, న్యూస్‌టుడే: శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని పరకాలరూరల్ సీఐ రంజిత్‌రావు అన్నారు. ముస్త్యాలపల్లిలో గురువారం ప్రజలతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలు సంయమనం పాటించాలన్నారు. దసరా పండగ రోజు జరిగిన గొడవకు సంబంధించి చిలేవేరు రాజేందర్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఆయనను గురువారం తహసీల్దార్ జ్యోతివరలక్ష్మిదేవి ముందు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఎస్సై అశోక్ ఉన్నారు.

గ్యాస్ పొయ్యిల అపహరణ

పరకాల, న్యూస్‌టుడే: పరకాలలో భూపాలపల్లి రోడ్డులోని ఓ దుకాణం ముందు ఉన్న 15 గ్యాస్ పొయ్యిలను బుధవారం రాత్రి ఇద్దరు దొంగలు అపహరించారు. వాటి విలువ రూ.20 వేలు ఉంటుందని స్థానికులు తెలిపారు. బుధవారం రాత్రి పరకాలతో పాటు పరకాల మండలం కామారెడ్డిపల్లిలో చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పింఛనులో కోత.. లబ్ధిదారుల వెత

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరుతో పాటు పలు పంచాయతీ కార్యాలయాల వద్ద తపాలా కార్యాలయ సిబ్బంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఆసరా పింఛన్ సొమ్మును అందజేస్తున్నారు. అయితే పంచాయతీ కార్యదర్శులు పింఛను సొమ్ములో నుంచి ఇంటి, నల్లా పన్నులను బలవంతంగా వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. దీపావళి పండగ వేళ అధికారులు ఇలా చేయడం సరికాదన్నారు. తమ కుమారుల నుంచి పన్నులను వసూలు చేయాలని, తమ పింఛను సొమ్ములో కోతలు పెట్టడం సరికాదని వృద్ధులు వాపోతున్నారు. దీనిపై మండల పంచాయతీ అధికారి విమలను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. బలవంతంగా వసూలు చేయడం లేదన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

దామెర, న్యూస్‌టుడే: ఈ నెల 26న కాకతీయ యూనివర్సిటీలో జరగనున్న మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల బాధ్యుడు గోవిందు రవికుమార్ పిలుపునిచ్చారు. సింగరాజుపల్లిలో గురువారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాంత్, రాజు, శ్రీధర్, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.